



పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మార్చి నెల రెండోవారంలో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. దీంతో రాజకీయ పక్షాలు అభ్యర్థుల ఎంపికలో తలమునకలవుతున్నాయి. జనవరి నుంచే అన్ని రాజకీయ పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తులు ప్రారంభించినా కాంగ్రెస్, బీజేపీ ఇంకా తర్జనభర్జన పడుతూ ఎవరిని పోటీకి నిలిపేది ప్రకటించడం లేదు. ఈ పార్టీల పరిస్థితికి భిన్నమైన వాతావరణం బీఆర్‌ఎస్‌లో కనిపిస్తున్నది. ఊహించని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ పరాజయం పాలైనా లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి నిలిపే అభ్యర్థుల ఎంపికలో ఒకడుగు ముందే ఉన్నది. కరీంనగర్ లోక్‌సభ స్థానానికి ఆ పార్టీ రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేరును ప్రకటించారు. ఆయన ఇప్పటికే రెండేసి సార్లు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో పర్యటించారు. బీఆర్‌ఎస్ పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేరును ఖరారు చేసింది. అధికారికంగా పేరు ప్రకటించక పోయినా ఆయననే అభ్యర్థిగా గుర్తించి పార్టీ శ్రేణులు, నాయకులు నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్నారు.

● బీజేపీలో..

భారతీయ జనతా పార్టీ అగ్రనాయకులు సిట్టింగ్ ఎంపీలకు టికెట్ ఇస్తామని ప్రకటించడంతో కరీంనగర్ సిట్టింగ్ ఎంపీ, ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అభ్యర్థిత్వం ఖరారైనట్లుగానే అందరూ భావిస్తూ వచ్చారు. అందుకు అనుగుణంగానే ఆయన నియోజకవర్గంలో ప్రజాహిత యాత్ర చేపట్టి తొలి విడతలో 119 కిలో మీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలకు వెళ్లి ఆయా గ్రామాల్లో, మండలాల్లో ఎంపీగా తాను చేయించిన పనులు, కేంద్రం విడుదల చేసిన నిధుల వివరాలు ప్రజలకు వివరించారు. అదే పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, కిసాన్‌మోర్చా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి పొల్సాని సుగుణాకర్‌రావు 'కేంద్రంలో మళ్లీ మోదీ.. ఈసారి కరీంనగర్‌లో సుగుణాకర్‌రావు' అనే నినాదంతో వాల్ పోస్టర్లు ముద్రించి నియోజకవర్గమంతటా అంటించి విస్తృత ప్రచారం చేయడంతో అభ్యర్థిత్వం విషయంలో కొంత చర్చకు దారితీసింది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో మళ్లీ సిట్టింగ్ ఎంపీలకు టికెట్ ఇచ్చే విషయంలో ఏకాభిప్రాయం వచ్చిందని వార్తలు వచ్చాయి. దీంతో కరీంనగర్‌లో బండి సంజయ్ అభ్యర్థిత్వానికి ఢోకా లేదని తేలిపోయింది.

● పెద్దపల్లి నియోజకవర్గంలో....

పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి ఉన్నది. ఇక్కడ నుంచి టికెట్ ఆశిస్తున్న వారిలో పెద్దపల్లి మాజీ ఎంపీ డాక్టర్ సీహెచ్ సుగుణకుమారి, గడ్డం వంశీకృష్ణ, ప్రజా సంఘాల జేఏసీ నాయకుడు గజ్జెల కాంతం, ఆసంపల్లి శ్రీనివాస్, ఊట్ల వరప్రసాద్, పెరుక శ్యాం ఉన్నారు. సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్‌నేత బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన ఇక్కడ నుంచి టికెట్ ఆశిస్తున్నారు. సుగుణకుమారి గతంలో నియోజకవర్గంలో రెండుసార్లు గెలుపొందిన ఎంపీగా టికెట్ ఆశిస్తున్నారు. గజ్జెల కాంతం ప్రజాసంఘాల జేఏసీ నాయకుడిగా, ఉద్యమకారుడిగా తనకున్న విస్తృత సంబంధాలతో తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుకుంటున్నారు. స్థానికులకే అవకాశం ఇవ్వాలి అనే నినాదంతో వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలతో ప్రజల్లో పని చేస్తూ పారిశ్రామిక ప్రాంతంలో సత్సంబంధాలు కలిగి ఉన్న ఆసంపల్లి శ్రీనివాస్, మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి మనవడిగా, మాజీ ఎంపీ ప్రస్తుత ఎమ్మెల్యే వివేక్ తనయుడిగా బరిలోకి దిగాలని ఆశిస్తున్న గడ్డం వంశీకృష్ణ రాజకీయంగా తమకున్న పట్టుతో టికెట్ కోరుకుంటున్నారు. ఈ నియోజకవర్గంలో మాదిగ సామాజికవర్గానికి ఎక్కువ ఓట్లు ఉండడంతో ఆ వర్గానికే టికెట్ ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తున్నది. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో అతి తక్కువ సందర్భాల్లో మాత్రమే మాదిగలకు అవకాశమిచ్చారని, ఈసారి అవకాశం కల్పించాలని ఆ వర్గం కోరుతున్నట్లు సమాచారం.

- కరీంనగర్‌లో కొలిక్కి వచ్చిన బీజేపీ టికెట్ వ్యవహారం
- కాంగ్రెస్‌లో కొనసాగుతున్న సస్పెన్స్
- బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఖరారు

పెద్దపల్లి నియోజకవర్గంలోనే అభ్యర్థి ఎవరన్న విషయం పార్టీ ఇంకా తేల్చడం లేదు. బలమైన అభ్యర్థి కోసం అన్వేషణ అంటూ ఈ నియోజకవర్గంలో ప్రతిసారి కాలయాపన చేస్తూ ఉండడం చివరికి ఎవరో ఒకరికి టికెట్ ఇచ్చి ఫలితం లేకుండా చేస్తున్నారన్న అభిప్రాయం పార్టీశ్రేణుల్లో బలంగా ఉన్నది. చివరి క్షణంలో అభ్యర్థిని ఖరారు చేయడంతో వారు ప్రచారం కూడా చేసుకోలేని స్థితిలో పరాజయం పాలవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈసారైనా పార్టీ నాయకత్వం వెంటనే అభ్యర్థిని ప్రకటించాలని ఆ పార్టీ నాయకులు కోరుతున్నారు. ఇక్కడ నుంచి టికెట్ ఆశిస్తున్న వారిలో బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ కుమార్ ఉన్నారు. ఆయనను పార్టీ ఇప్పటికి రెండేసి సార్లు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో అటు ధర్మపురి నియోజకవర్గంలో, ఇటు పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గంలో అభ్యర్థిగా ప్రకటిస్తూ వస్తున్నది. ఈసారి అలాకాకుండా ఆయనకే టికెట్ ఇవ్వాలనే అభిప్రాయం కూడా పార్టీలో బలంగా వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్ పార్టీలో ఇటు కరీంనగర్‌లోనూ అటు పెద్దపల్లిలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నది.

● కాంగ్రెస్‌లో..

కరీంనగర్ లోక్‌సభ స్థానంలో షార్ట్‌లిస్టులో అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, రుద్ర సంతోష్‌కుమార్ పేర్లు ఉన్నాయి. అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అసెంబ్లీ టికెట్ ఆశించగా ఆ స్థానంలో పొన్నం ప్రభాకర్‌కు అవకాశం కల్పించారు. ఆయన అక్కడ గెలుపొంది మంత్రి బాధ్యతలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రవీణ్‌రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అదే మాటకు కట్టుబడి ఇప్పుడు ప్రవీణ్‌రెడ్డికి కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థిత్వం ఖరారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని సమాచారం. ఆయన ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీకి చెందిన నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలతో చర్చించినట్లు సమాచారం. ఎమ్మెల్యేలందరూ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావుకు అవకాశం కల్పించే విషయంలో సానుకూలత వ్యక్తం చేస్తూ వచ్చారు. ముఖ్యమంత్రి తన ఆలోచనను వారిముందుంచడంతో వారు ఆయన మాటకు ఓకే చెప్పారని పార్టీ వర్గాలు అనుకుంటున్నాయి. సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వెలిచాల రాజేందర్‌రావుకు ఎమ్మెల్యేలు, మంత్రి పొన్నం ప్రభాకర్ అండదండలుండడంతో ఆయన అభ్యర్థిత్వ ఖాయమనే అందరూ భావిస్తూ వచ్చారు. అందుకు అవకాశాలు మిగతా ఇద్దరు సభ్యులతో సమానంగా మారినట్లు చెబుతున్నారు. బీసీ వర్గానికి చెందిన రుద్ర సంతోష్‌కుమార్ కరీంనగర్ లోక్‌సభ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఆయన రాహుల్‌గాంధీ టీం సభ్యుడిగా ఉంటూ వివిధ సందర్భాల్లో ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల గెలుపుకోసం వార్ రూమ్‌లో ఉంటూ వారికి అవసరమైన సూచనలు చేస్తూ అవసరమైన ప్రచార వ్యూహాలను రూపొందిస్తున్నారు. ఆయన ప్రస్తుతం టికెట్ ఆశిస్తున్నారు. నియోజకవర్గంలో అత్యధిక ఓటు బ్యాంకు ఉన్న బీసీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. బీసీ గణనకు తీర్మానం చేసిన పార్టీ, బీసీ అభ్యర్థికి టికెట్ ఇస్తే సానుకూల ఫలితాలు ఉంటాయని, ఇవ్వక పోతే బీసీ గణన ప్రక్రియలు మొక్కుబడి కోసం చేస్తున్న ప్రయత్నాలుగా ప్రజలు భావించే పరిస్థితి ఉంటుందని వాదనను తెరపైకి తెస్తున్నారు. రాష్ట్రంలో రెడ్డి అభ్యర్థులు ఎక్కువవుతున్న నేపథ్యంలో కరీంనగర్‌లో బీసీకి అవకాశం కల్పించాలని అందులో పార్టీకి విధేయుడిగా ఉంటూ అప్పగించిన కార్యక్రమా లను చేస్తూ వస్తున్న సంతోష్‌కుమార్‌కు టికెట్ ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో ప్రవీణ్‌రెడ్డికి టికెట్ వస్తుందా... ఏఐసీసీ పెద్దల అండతో సంతోష్‌కుమార్ టికెట్ దక్కించుకుంటారా... ఎమ్మెల్యేలు, మంత్రి పొన్నం ప్రభాకర్ మద్దతుతో రాజేందర్‌రావు అభ్యర్థిగా ఖరారవుతారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

కొత్తగట్టు ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షలు

● ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



శంకరపట్నం మండలం కొత్తగట్టులో ఎంపీ బండి సంజయ్‌కుమార్ పూజలు

శంకరపట్నం, ఫిబ్రవరి 25: కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ అభివృద్ధికి 10 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ప్రకటించారు. ఆదివారం రాత్రి శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధి కోసం ఎంపీ లాడ్స్ నిధుల నుంచి 10లక్షలు, రీడింగ్ రూమ్, అడిషనల్ రూమ్ భక్తుల సౌకర్యార్థం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మండపం నిర్మాణం మధ్యలో ఆగిందని, మళ్లీ ఎంపీగా గెలిచిన తర్వాత మే నెలలో మరో 10లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను ఆలయ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి, అర్చకుడు మురళీధరాచారి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాడ వెంకట్‌రెడ్డి, అలివేలు సమ్మిరెడ్డి, ఏనుగుల అనిల్, దండు కొంరయ్య పాల్గొన్నారు.

● ముగిసిన మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాలు



కోనేరులో స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

మండలంలో కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆలయానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి సుప్రభాతం, నిత్యారాధన, బాల భోగం, శేష హోమం, మహా పూర్ణహుతి, బలిహరణం కార్యక్రమా లను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు స్వామివారి పుష్కరిణిలో చక్రస్నానం చేయించారు. అనంతరం పుష్పయాగం, నాకబలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి, ఈవో సుధాకర్ పాల్గొన్నారు.



స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

● బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, లాభార్థి సంపర్క్ అభియాన్ కన్వీనర్ మాధవి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 25: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పని చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, లాభార్థి సంపర్క్ అభియాన్ కన్వీనర్ కె మాధవి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన లాభార్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. పది సంవత్సరాలుగా ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ ప్రభుత్వం అడుగులు వేసిందని అన్నారు. పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద 80 కోట్ల భారతీయులకు ఉచిత రేషన్ పంపిణీ, పీఎం ఆవాస్ యోజన కింద నాలుగు కోట్లకుపైగా పేదలకు పక్కా ఇల్లు ఇచ్చారన్నారు. ఈ విషయాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, నాయకులు బత్తుల లక్ష్మీనారాయణ, మాడ వెంకట్‌రెడ్డి, గోపి, రంగు భాస్కరాచారి, మల్లికార్జున్, దుబాల శ్రీనివాస్, జగన్‌రెడ్డి, గౌతంరెడ్డి, శ్రవణ్, దండు కొమురయ్య, కల్యాణ్‌చంద్ర, జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌పటేల్, జాడి బాల్‌రెడ్డి, రతన్, సంతోష్ పాల్గొన్నారు.

నేటి నుంచి మలివిడత ప్రజాహిత యాత్ర

- కోహెడలో యాత్రకు శ్రీకారం చుట్టనున్న ఎంపీ బండి సంజయ్
- ప్రతి రోజు 10 గ్రామాల్లో పాదయాత్రకు రూట్ మ్యాప్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 25: భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్‌కుమార్ సోమవారం నుంచి మలిదశ ప్రజాహిత యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండల కేంద్రంలో ఉదయం 11 గంటలకు యాత్ర ప్రారంభించనున్నారు. మొదటి రోజు కోహెడ మండలంలో ప్రారంభమయ్యే యాత్ర తీగలగుట్టపల్లి, గోటమిట్ల, నారాయణపూర్, విజయనగర్, చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి, చిన్న ముల్కనూర్, చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల్లో పాదయాత్ర చేస్తారు. రాత్రి బొమ్మనపల్లి సమీపంలోని ప్రైవేట్ స్కూల్‌లో బస చేస్తారు. యాత్రలో భాగంగా కోహెడ, చిగురుమామిడి మండల కేంద్రాల్లో సంజయ్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ప్రతిరోజు సగటున 10 గ్రామాల్లో పాదయాత్ర చేసేలా బీజేపీ జిల్లా నాయకత్వం రూట్ మ్యాప్‌ను ఖరారు చేసింది. పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్ర కొనసాగించనుంది. మలిదశ యాత్రలో భాగంగా సోమవారం నుంచి మార్చి 1వ తేదీ వరకు హుస్నాబాద్, హుజురాబాద్ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. మార్చి 2వ తేదీనాటికి హుస్నాబాద్, హుజురాబాద్ నియోజకవర్గాల్లో ప్రజాహిత యాత్రను పూర్తిచేసేలా రూట్ మ్యాప్ రూపొందించారు. ప్రజాహితయాత్రను విజయవంతం చేసేందుకు జిల్లా నాయకత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.

నత్తనడకన రైల్వేబ్రిడ్జి నిర్మాణం





నిర్మాణంలో ఉన్న పిల్లర్లు

- గేటు పడగానే వేలాదిగానిలిచి పోతున్న వాహనాలు
- ఇబ్బందుల్లో వాహనదారులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 25: కరీంనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి గాను కేంద్ర ప్రభుత్వం 154 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. ఆగస్టులో పనులను ప్రారంభించారు. రెండు వైపులా నాలుగు వరుసల ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉన్నది. ఇందులో భాగంగా ఒక వైపు రెండు వరుసల నిర్మాణాన్ని చేపట్టారు. చొప్పదండి వైపు ఏడు పిల్లర్లు, కరీంనగర్ వైపు ఎనిమిది పిల్లర్లు నిర్మిస్తున్నారు. మార్చి నాటికి రైల్వే ఆర్వోబీ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నా ఇప్పటికీ పిల్లర్ల దశలోనే పనులు సాగుతున్నాయి. దీంతో రైల్వే గేటు వద్దవాహన దారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గేటుకు తోడు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండడంతో వాహనదారులు గేటును దాటాలంటే గంటల సమయం పడుతున్నది. ఈ గేటు ద్వారా మంచిర్యాల, లక్షెట్టిపేట, ధర్మారం, చొప్పదండి ప్రాంతాలకు వాహనాలు వెళుతుంటాయి. రోజుకు లక్షలాది వాహనాలు ఈ గేటు వద్దకు రావడం ఒక ఎత్తైతే గేటును దాటి గమ్య స్థానాలకు చేరడం మరో ఎత్తవుతున్నది.

● అంబులెన్స్‌లకు తప్పని తిప్పలు

దూర ప్రాంతాల నుంచి అంబులెన్స్‌లలో కరీంనగర్ వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు పదుల సంఖ్యలో రైళ్లు ఈ గేటు గుండా వెళ్లినప్పుడల్లా గేటు పడడంతో అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైల్వే ఇంజన్ మార్చుకునే సమయంలోనూ గేటు వేస్తుండడంతో ప్రయాణికులు వేచి చూడాల్సి వస్తోంది.

● పనులు పూర్తయ్యేదెప్పుడు?

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు ఎప్పుడు పూర్తవుతాయని వాహన దారులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రెండు వైపులా వంతెన నిర్మాణంతో పాటు, రోడ్డు కిరువైపులా భూమి సేకరించి సర్వీసు రోడ్డు నిర్మించాల్సి ఉంది. పనులు వేగవంతం చేసి వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● గంటల తరబడి ట్రాఫిక్ జామ్

కరీంనగర్ రైల్వే స్టేషన్ వద్ద గేటు పడగానే వాహనదారులు ముందుకు వచ్చి రెండు వైపులా వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఎదురుగా వచ్చే వాహనాలు ముందుకు కదలలేకపోతున్నాయి. గేటు వద్ద పోలీసులను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉంది.



రైల్వే గేటు పడగానే నిలిచిన వాహనాలు

పోలీస్‌స్టేషన్‌కు చేరిన హుండీలు

పాలకుర్తి, ఫిబ్రవరి 25: పాలకుర్తి మండలం పరిధిలోని ఈసాలతక్కళ్ళపల్లి గ్రామంలో జరిగిన సమ్మక్క-సారలమ్మల జాతరకు సంబంధించిన నాలుగు హుండీలను కొన్ని కారణాల వల్ల ఆదివారం లెక్కింపు చేయలేక పోయా మని జాతర గద్దెల వద్ద హుండీలకు రక్షణ లేకపోవడంతో ఉన్నతాధి కారుల సూచన మేరకు హుండీలను బసంత్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో భద్రపరి చామని దేవాదాయ శాఖ డివిజన్ ఇన్స్పెక్టర్ ఆర్ సుజాత, ఈవో కె కాంతా రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కె రత్నాకర్‌లు తెలిపారు. హుండీల లెక్కింపు విషయంలో ఈసాల తక్కళ్ళపల్లి, రామరావు పల్లి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన కమిటీ సభ్యులకు సయోధ్య కుదరకపోవడంతో లెక్కింపును వాయిదా వేసిన దేవాదాయ శాఖ అధికారులు ఇక్కడ భద్రపరి చారని బసంత్‌నగర్ ఎస్సై ఆర్ స్వామి తెలిపారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాల జాతర

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 25 :కోరుట్ల మండలంలోని నాగుల పేట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మకు బోనాల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ దేవాయలంలో పోతరాజులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట మహిళలు, సంఘ సభ్యులు గ్రామంలో బోనాల శోభాయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా పోతరా జులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మహి ళలు రేణుక ఎల్లమ్మకు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకొని వన భోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నేతలు పాల్గొన్నారు.



బోనాలతో గౌడ సంఘ సభ్యులు, మహిళలు

పూర్తయ్యేదెన్నడు?

- నారాయణపూర్ రిజర్వాయర్‌ను పట్టించుకోని ప్రభుత్వాలు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని కాలువల పనులు

గంగాధర, ఫిబ్రవరి 25: మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ కాలువల పనులు ఏళ్లు గడిచినా పూర్తి కాలేదు. ఈ రిజర్వాయర్ పనులు 19 ఏళ్ల క్రితం ప్రారంభించారు. పనులు పూర్తి చేస్తే ఎడమ, కుడి కాలవల ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. ఉప కాలువలతో గొలుసుకట్టు చెరువులు నింపవచ్చు. పదేళ్ల క్రితం ఎడమ కాలువ పనులు 90 శాతం పూర్తయ్యాయి. గత ప్రభుత్వం 10 శాతం పనులను పెండింగ్‌లో పెట్టింది. ఎడమ కాలువ లింకు డి1 కాలువకు సిమెంటు చేయలేదు. రెండేళ్ల క్రితం కుడికాలువ పనులను ప్రారంభించగా నత్తనడకన సాగుతున్నాయి. కరీంనగర్, జగిత్యాల ప్రధాన రహదారిపై కాలువ పెండింగ్‌లో ఉంది. వేములవాడ దారిలో వంతెన పూర్తయినా చిన్నచిన్న పనులు చేయాల్సి ఉంది. ప్రధాన రహదారి నుంచి వేములవాడ వరకు పలువురి ఇళ్లు కాలువలో పోతున్నాయి. వాటికి పరిహారం అందించి పనులు చేయడంలో జాప్యం జరుగుతోంది. కుడికాలువకు 20 ఏళ్ల క్రితం భూమిచ్చిన రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. కుడికాలువ పూర్తయితే గంగాధర, రామడుగు, బోయినపల్లి మండలాలకు సాగునీటితో పాటు తాగునీటి ఇబ్బందులు తొలుగుతాయి. కొత్త ప్రభుత్వం నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరందించాలని కోరుతున్నారు.

● మరమ్మతులు కరువు

ఎడమ కాలువ ద్వారా కొంతప్రాంతానికి సాగునీరు అందిస్తున్నారు. డి1 కాలువ సిమెంటు పనులు నాణ్యత లోపంతో పగుళ్లుబారియి. పగుళ్లు ఉన్న ప్రాంత్రంలో నీరు వృథాగా పోతోంది. 20 కిలోమీటర్ల మేర ఉన్న కాలువ గోడలకు పిచ్చిమొక్కలు, తుమ్మ చెట్లు పెరిగి సిమెంటు రాలిపోతోంది. నీటిపారుదల శాఖ అధికారులు ఈ కాలువను పట్టించుకున్న పాపాన లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రిజర్వాయర్, కాలువ పనులు పూర్తి చేసి ఆయకట్టుకు సాగునీరిందించాలని రైతులు కోరుతున్నారు.



కాలువలో కొట్టుకొచ్చిన చెత్త



లక్ష్మీదేవిపల్లి కాలువపై దారికి పైపులు వేసిన రైతులు



పగిలిన డి1 కాలువ గోడ

పోగొట్టుకున్న బంగారం మహిళకు అప్పగింత

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 25: పోగొట్టుకున్న బంగారం తిరిగి సదరు మహిళకు అప్పగించి ఓ మహిళ ఉదారత చాటుకుంది. కాగజ్‌నగర్‌కు చెందిన కొమరోజు కమల ఈనెల 23న తుర్కల మద్దికుంట సమ్మక్క సారలమ్మ జాత రకు వచ్చింది, జాతర తన రెండు తులాల బంగారం, 3వేల రూపాయలు నగదు పోగొట్టుకుంది. మద్దికుంట గ్రామానికి చెందిన చల్లోజు కవితకు దొరికింది, కవిత పోలీసులను ఆశ్రయించడంతో ఆమె ఆ చూకీ తెలుసుకుని ఆదివారం సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మన్ రావు ఆమెకు అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు బంగారం అప్పగించిన కవితను అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తిని పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 25: ప్రస్తుతం పిల్లలు ఎత్తుకెళ్లే గ్యాంగ్ తిరుగుతుందని సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతుండటంతో గ్రామంలో ఎవరు కొత్తగా కనపడిన వారిపై గ్రామస్థులు అనుమానంతో దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇస్తున్నారు. పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేట గ్రామంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి సంచరిస్తుండటంతో పిల్లలు ఎత్తుకెళ్లే వారే అనుకొని గ్రామస్థులు అతన్ని మందలించారు. సమాధానం ఏం చెప్పకపోవడంతో పెద్దపల్లి పోలీసులకు సమాచారం అందించినట్లు గ్రామస్థులు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య



మధునమ్మ (ఫైల్)

ఇల్లందకుంట, ఫిబ్రవరి 25: మండలంలోని లక్ష్మాజిపల్లెకు చెందిన కోడూరి మధునమ్మ (70) అనే వృద్ధురాలు బావిలో దూకి మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధునమ్మకు కొద్ది రోజులుగా కడుపు నొప్పి ఉండగా, ఎన్ని మందులు వాడినప్పటికి నొప్పి తగ్గలేదు. శనివారం రాత్రి ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మధునమ్మ కుమారుడు సదానందం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజకుమార్ తెలిపారు.

కుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలు

రామగిరి, ఫిబ్రవరి 25: మండలంలోని కల్వచర్లలో ఆదివారం కుక్కల దాడుల్లో ముగ్గురు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామపంచాయతీ పరిధిలోని కృష్ణానగర్‌లో యేసు(3), పాతబస్తీలోని కాటమోక్షిత్‌గౌడ్(4), కొట్టే వాడలోని కొలిపాక శాన్విక(4) పై కుక్కలు దాడి చేయాయి. ఈ దాడిలో చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన చిన్నారులను తల్లిదండ్రులు కరీంనగర్, గోదావరిఖని ఆస్పత్రులకు తరలించారు.

యువకుడి ఆత్మహత్య

మల్యాల, ఫిబ్రవరి 25: దిగువ కొండగట్టులో ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అబ్దుల్ రహీం తెలిపిన వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలం బొమ్మెనకు చెందిన భారతల రాము(35) అనే యువకుడు కొన్నాళ్లుగా అప్పుల బాధ, ఉద్యోగం కోసం ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో గత నెల 23న ఇంట్లో నుంచి బయటకు వచ్చిన రాము ఇంటికి తిరిగి వెళ్లలేదు. ఈ క్రమంలో కొండగట్టు వద్ద చెట్టుకు వేలాడుతున్న ఓ మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆ మృతదేహాన్ని రాముదిగా గుర్తించారు. మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాము కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

● నాగంపేటలో వృద్ధుడు..

గంభీరావుపేట, ఫిబ్రవరి 25: మండలంలోని నాగంపేట గ్రామానికి చెందిన అంకం బాలయ్య (75) అనే వృద్ధుడు అనారోగ్య కారణాలతో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. బాలయ్య కొంత కాలంగా అనారోగ్యం, వృద్ధాప్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లోని వారందరూ ఓ శుభకార్యం నిమిత్తం వెళ్లారు. ఎవరూ లేని సమయంలో ఇంటి ఎదుట ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడు. బాలయ్య కుమారుడు బాలరాజు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాంమోహన్ తెలిపారు.

రూ. 30 వేలు, కారు చోరీ

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 25: సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట పరిధిలోని శ్రీనివాస ట్రేడర్స్‌లో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దొంగలు ముందుగా సీసీ కెమెరాల కనెక్షన్ తొలగించి లోనికి వెళ్లారు. కౌంటర్‌లో ఉన్న 30 వేల నగదు దొంగిలించి చిరిగిన నోట్లను వదిలేశారు. ఆ తర్వాత కౌంటర్‌లో ఉన్న తాళం చెవిని తీసుకొని షెడ్డులో పార్క్‌చేసి ఉన్న కారును ఎత్తుకెళ్లారు. వీటితోపాటు సీసీకెమెరాల దృశ్యాలను రికార్డుచేసే డీవీఆర్‌ను తీసుకెళ్లారు. దుకాణం తెరిచేందుకు నిర్వాహకులు సంజీవరావు, శంకర్ ఉదయం వచ్చే సరికి కారు కనిపించలేదు. దుకాణం తాళం పగులగొట్టి లోపల వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. కౌంటర్ లోపల చూస్తే నగదు చోరీ అయ్యిందని గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వాఖ్యలు చేసిన యువకుడిపై కేసు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 25: సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తూ పోస్టింగ్‌లు పెట్టిన నందెల్లి మహిపాల్ అనుచరుడు తాండ్ర సతీష్‌పై కేసు నమోదు చేశామని కరీంనగర్ రెండో టౌన్ సీఐ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక భూమి వివాదానికి సంబంధించిన కేసులో బీఆర్ఎస్ నాయకుడు, ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మహిపాల్ అరెస్టు అనంతరం అతని అనుచరుడు కొత్తపల్లి మండలం బద్దిపల్లికి చెందిన తాండ్ర సతీష్ (29) నందెల్లి మహిపాల్ అన్న యువసేన అనే వాట్సప్ గ్రూపులో రెగొట్టే వాఖ్యలు పోస్టు చేసి వైరల్ చేశాడు. ఇతరులను రెచ్చగొట్టే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించినందుకు తాండ్ర సతీష్‌పై ఐపీసీ సెక్షన్ 153, 505(2), 506 కింద కేసు నమోదు చేశామని సీఐ వెంకటేష్ తెలిపారు. అనుచిత వాఖ్యలు, రెచ్చగొట్టే వాఖ్యలతో పోస్టింగ్‌లు పెట్టినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు



ట్రాక్టర్ యాజమానులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వరంగంటి రవికుమార్

జమ్మికుంట, ఫిబ్రవరి 25: ఇసుక అక్రమగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ హెచ్చరించారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్ యాజమానులకు పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్నారని యాజమాని శ్రీనివాస్, డ్రైవర్ రవి పోలీస్ సిబ్బందిని చేతులతో నెట్టివేశారన్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన శ్రీనివాస్, రవిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరో సారి ఇలాంటి సంఘటనలు పుణరావృతం అయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. గతంలో క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తులపై పీడీ యాక్ట్ పెడుతామని హెచ్చరించారు. ఇసుక అవసరం ఉన్న వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెప్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాధకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా భీమేశ్వర కల్యాణం



ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

రాయికల్, ఫిబ్రవరి 25: పట్టణంలోని భీమేశ్వర స్వామి ఆలయంలో భీమేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ఊరేగింపు నిర్వహించారు. రాత్రి సమయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం భక్తులు భీమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో భీమన్న సేవా సమితి సభ్యులు నీలి రాములు, ఒజ్జల నరేందర్, సుతారి తిరుపతి, నీలి తిరుపతి, పడాల గోపి, ఒజ్జల రాజరెడ్డి, నీలి చిన్న రాములు, నీలి నరేష్, జగడం మల్లేష్, నీలి రమేష్, మున్నూరుకాపు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల హక్కులను కాలరాసిన కేసీఆర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ వీరయ్య

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 25: వికలాంగుల హక్కులను కేసీఆర్ ప్రభుత్వం కాలరాసిందని కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య విమర్శించారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం ఆధ్వర్యంలో కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెటనే మొదటి ఉద్యోగం వికలాంగురాలు రజినీకి ఇస్తూ సీఎం రేవంత్‌రెడ్డి సంతకం చేసి వారిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటారన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం రోజున నిర్వహించిన కార్యక్రమానికి అప్పటి సీఎం కేసీఆర్ హాజరు కాలేదని అన్నారు. వికలాంగులను ఉద్దేశించి మరుగుజ్జులు అని సంబోధించి వారి మనోభావాలను కించపరిచారని అన్నారు. టీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోలో జిల్లాకో వికలాంగుల స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖను కేసీఆర్ మహిళ శిశు సంక్షేమ శాఖలో విలీనం చేసి వికలాంగుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. వికలాంగుల వాహనాలకు ఇచ్చే రాయితీని, అంత్యోదయ కార్డులను ఎత్తివేశారన్నారు. కార్పొరేషన్ చైర్మన్‌ల పదవుల భర్తీలో దివ్యాంగులకు కూడా అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో వికలాంగుల అభివృద్ధిపై మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ చర్చకు రావాలని సవాల్ విసిరారు. వికలాంగులకు పెన్షన్లు మూడువేల నుంచి ఆరు వేల రూపాయలకు పెంచామన్నారు. కాంగ్రెస్ హయాంలో వికలాంగులకు టెలిఫోన్ బూత్‌లు కేటాయించామని తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి దివ్యాంగులు పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన 250 మంది వికలాంగుల విభాగం ప్రతినిధుల సమక్షంలో ఆరు తీర్మానాలు ప్రవేశ పెట్టి ఆమోదించారు. కార్యక్రమంలో కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, టీపీసీసీ అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌రావు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, టీపీసీసీ నాయకులు రహమత్ హుస్సేన్, రామిడి రాజిరెడ్డి, కరీంనగర్ డీసీసీ సమన్వయకర్తలు మొగిలి లక్ష్మయ్య, నందగిరి జగదీశ్వరచారి, గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల విభాగం చైర్మన్ దేశ గాని సతీష్, అబ్దుల్లా అజీజ్, కంది నాగరాజు, సంపత్ , ఏన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీవో 317పై మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు హర్షణీయం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 25: జీవో 317 సమస్యలపై రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం హర్షణీయమని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అన్నారు. సిరిసిల్లలో ఆదివారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ జీవో 317 ద్వారా ఏర్పడిన సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారాలను సిఫార్సు చేయడం కోసం జీవో 292 ద్వారా రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అధ్యక్షతన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 అమలులో భాగంగా ఉద్యోగుల శాశ్వత కేటాయింపు కోసం గత ప్రభుత్వం 2021 డిసెంబరు 6న ఏకపక్షంగా జీవో 317ను విడుదల చేసిందని విమర్శించారు. ఈ జీవో ద్వారా పలువురు ఉద్యోగులు ఉపాధ్యాయులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. కేడర్‌లో జూనియర్ అయినందుకే సొంత జిల్లాలను వదిలి పక్క జిల్లాలకు వెళ్లారని, భార్యభర్తలను కూడా వేరు చేయడం జరిగిందని అన్నారు. నిబంధనల ప్రకారం భార్యభర్తలను ఒకే జిల్లాకు బదిలీ చేయాల్సి ఉండగా 19 జిల్లాలో అనుమతించి 13 జిల్లాలను బ్లాక్ చేశారన్నారు. స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులుకు, ఉద్యోగాల కోసం విడిపోయిన భార్యభర్తలకు న్యాయం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేశామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యను వివరించగా అధికారంలోకి వస్తే జీవో 317పై పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశాల్లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, జిల్లా కార్యదర్శి అంబటి రమేష్, లత, పరకాల రవీందర్, వంగ మల్లేశం, శివకుమార్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రాంనాథ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ పూరెల్లి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు పురం వాసుదేవరావు, మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, విక్కుర్తి అంజయ్య, దెబ్బడ హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పార్వేట్ ఉత్సవం



పార్వేట్ ఉత్సవంలో భాగంగా చిరుతపులిని వేటాడుతున్న అర్చకులు

బీర్‌పూర్, ఫిబ్రవరి 25: బీర్‌పూర్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా పార్వేట్ ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహ స్వామి వారు అటవీ ప్రాంతానికి పర్యటనకు వెళ్లగా, అక్కడ లక్ష్మీదేవికి చిరుత కనిపించడంతో దానిని వేటాడాలని స్వామివారిని కోరుతుంది. ఈ సన్నివేశాన్ని అర్చకులు మంత్రోచ్చరణల మధ్య చిరుతను వేటాడే సన్నివేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, జడ్పీటీసీ పాత పద్మ రమేష్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావ్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎనగంటి సామ్రాట్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు పెద్ద సంతోష్, మధు, చిన్న సంతోష్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మతల్లి పండగ



అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న భక్తులు

గంభీరావుపేట, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్ రూంల సముదాయంలో ఆదివారం మైసమ్మతల్లి పండగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను ఎత్తుకుని డప్పు చప్పుళ్ళతో ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మైసమ్మతల్లికి పట్నాలు, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కాలనీ వాసులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మల్లుగారి నర్సాగౌడ్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రథోత్సవాలు



స్తంభంపల్లిలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం



బుగ్గారంలో రథోత్సవంలో పాల్గొన్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్, ఫిబ్రవరి 26: మండలంలోని స్తంభంపల్లిలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీ సంవత్సరం మాఘమాసంలో వచ్చే పౌర్ణమి మరుసటి రోజు రథోత్సవం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై నిలిపి ఉత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వారికి కోర మీసాలు, పట్టి నామాలు సమర్పించుకున్నారు.

● బుగ్గారం: మండల కేంద్రంలో శ్రీ ముత్యాల-నల్ల పోచమ్మ రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా మాఘ మాసంలో వచ్చే పౌర్ణమి మరుసటి రోజు రథోత్సవాన్ని నిర్వహించారు. ఒగ్గు కళాకారులు, డప్పు చప్పుళ్ళ మధ్య భక్తులు నాట్యాలు చేస్తూ పోచమ్మ ఆలయం చుట్టూ ఐదు సార్లు రథాన్ని తిప్పారు. వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని పూజలు చేశారు. ఎస్సై శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బాదినేని రాజేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, ఉపాధ్యక్షుడు నర్సాగౌడ్ పాల్గొన్నారు.

● కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో ఆదివారం వేంకటేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. వేకువ జాము నుంచే భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. మొక్కులు చెల్లించుకున్న భక్తులు వైభవంగా సాగిన రథోత్సవాన్ని వీక్షించారు. పండితులు రథారదన, రథహోమం, రథ బలిహారణం అనంతరం గ్రామంలో రథాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గడీల గంగప్రసాద్, కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



తాండ్ర్యాలలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం

నల్లగొండలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

కొడిమ్యాల, ఫిబ్రవరి 25: మండలంలోని నల్లగొండ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం రథోత్సవంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాలు ముగిసినప్పటికీ ఆదివారం సెలవు రోజు కావడంతో ఎగువ, దిగువ ఆలయాల్లో స్వామి వారిని వివిధ ప్రాంతాల నుంచి భారీగా వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 25: పట్టణంలో శాంతినగర్‌లో అద్దెకు ఉంటున్న ఇంటికే కన్నం వేసిన వరంగల్ జిల్లా అబ్బనికుంటకు చెందిన అనుముల రాజేంద్రప్రసాద్(35)ను ఆదివారం పెద్దబజార్‌లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఈ నెల 13న సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన అడ్డగట్ల అరవింద్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగుల గొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువాలోని బంగారు గొలుసు, కమ్మలు, రెండు రింగులు, 15 తులాల వెండి, 40 వేల నగదు ఎత్తుకెళ్లా డు. రాజేంద్రప్రసాద్ ఫిర్యాదుతో విచారణ చేపట్టామని, రాజేంద్రప్రసాద్ వద్ద బంగారు, వెండి ఆభరణాలు స్వాధీ నం చేసుకొని కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు.

కొడుకు పెళ్లి కావడం లేదని మహిళ ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 25: కొడుకు పెళ్లికావడం లేదని సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన చిప్ప శారద (48) ఆదివారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం.. నెహ్రూనగర్‌కు చెందిన శారద కొడుకుకు వివాహం కావడం లేదని నిత్యం బాధపడేది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైపునకు చీరతో ఉరేసుకుంది. కొడుకు పెళ్లి కావడంలేదనే మనస్తాపంతో తన భార్య ఆత్మహత్య చేసుకుందని భర్త దేవదాసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మంత్రాలు చేస్తోందని మహిళపై దాడి

బీర్‌పూర్, ఫిబ్రవరి 25: తన కూతురుకు మంత్రాలు చేశారనే నెపంతో మహిళ ఇంటిపై దాడి చేసిన ఘటనలో ఒకరిపై ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన సంకటాల జలపతి అనే వ్యక్తి తన కూతురుకు మంత్రాలు చేశాడనే అనుమానంతో అదే గ్రామానికి చెందిన పోరెడి అమృత ఇంటిపై ఆదివారం దాడి చేసి దుర్భాషలాడాడు. అమృత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తండ్రిపై దాడి చేసిన కుమారుడిపై కేసు

బీర్‌పూర్, ఫిబ్రవరి 25: తండ్రిపై దాడి చేసిన కుమారుడిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు. బీర్‌పూర్ మండలంలోని నర్సింహుల పల్లికి ఆడెపు చంద్రయ్యపై అతడి చిన్న కుమారుడు ఆడెపు సత్తయ్య కర్రతో దాడి చేశాడు. దీంతో చంద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్తయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చొప్పదండి, ఫిబ్రవరి 25: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ముదిగంటి రఘుపతి (39) అనే వ్యక్తి కరీంనగర్ సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్‌ఐ ఉపేంద్రాచారి కథనం మేరకు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనకు చెందిన ముదిగంటి రఘుపతి (39) కుటుంబంతో కలిసి చొప్పదండిలోని పడకంటి కృష్ణ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. ఇంటి యజమాని కృష్ణ వద్ద రఘుపతి కొంత డబ్బు అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు చెల్లించమని కృష్ణ వేధించాడని ఈనెల 19న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రఘుపతి భార్య మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంభీర్‌పూర్‌లో ఎరువుల దుకాణం సీజ్

కథలాపూర్, ఫిబ్రవరి 25 : మండలంలోని గంభీర్‌పూర్‌లో మహేంద్ర ఎరువుల, పురుగు మందుల దుకాణాన్ని ఆదివారం సీజ్ చేసినట్టు ఏవో యోగిత తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గంభీర్‌పూర్ వెళ్లి దుకాణాన్ని పరిశీలించగా లైసెన్స్ గడువు మీరినప్పటికీ ఎరువులు విక్రయిస్తున్నట్టు గుర్తించామన్నారు. రైతులకు బిల్లులు ఇవ్వకపోవడం రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించలేదని తేలిందన్నారు. ఈ క్రమంలో లైసెన్స్‌ను రద్దు చేస్తూ ఏడీఏకు సిఫార్సు చేశామన్నారు. రైతులు డీలర్ వద్ద తీసుకునే ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలకు తప్పనిసరిగా రసీదులు పొందాలని సూచించారు.

వృద్ధులకు మెరుగైన వసతులు కల్పించాలి

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 23: వృద్ధులకు మెరుగైన వసతులు కల్పించాలని పర్సన్స్ విత్ డిసేబులిటీస్, సీనియర్ సిటిజన్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ ట్రాన్స్ జెండర్స్ శాఖ కమిషనర్ బి శైలజ అన్నారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని వయో వృద్ధుల ఆశ్రమాన్ని ఆమె ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని గదులను పరిశీలించి ఆవరణలో పెంచుతున్న కిచెన్ గార్డెన్‌ను చూసి అభినందించారు. వృద్ధులకు అందుతున్న వసతులు తదితర అంశాలపై ఆరా తీశారు. వృద్ధులకు నిత్యం గుడ్లు, అరటి పండ్లు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. వారికి ఆస్తీ, కుటుంబ సంబంధిత వివాదాలు ఉంటే సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సిబ్బంది పాల్గొన్నారు.

మల్కపేట రిజర్వాయర్ కాలువల పనులను పూర్తి చేయాలి

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 25: మల్కపేట రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. వేములవాడలో అధికారులతో ఆదివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మిడ్ మానేరు నుంచి అప్పర్ మానేరు వరకు నీరందించే ప్యాకేజీ-9కి సంబంధించి పనుల పురోగతిపై తెలుసుకున్నారు. సింగసముద్రం చెరువు నుంచి అప్పర్ మానేరు ప్రాజెక్టు వరకు బ్యాలెన్స్ పనులు, మల్కపేట రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలు పూర్తయ్యేందుకు కావాల్సిన నిధుల విడుదలపై ముఖ్యమంత్రితో చర్చించడానికి అవసరమైన నివేదికలను పరిశీలించారు. బ్యాలెన్స్ పనులను పూర్తి చేస్తే తక్షణమే 20 వేల నుంచి 30 వేల ఎకరాల వరకు ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చన్నారు. నిమ్మపల్లి నుంచి వేములవాడ వరకు మూలవాగుపై నిర్మించిన చెక్ డ్యాములు వరదల కారణంతో దెబ్బతిని పొలాలు కోతకు గురయ్యాయని, భవిష్యత్‌లో మరోసారి రైతుకు నష్టం జరగకుండా మరమ్మతులు చేయాలని సూచించారు. దెబ్బతిన్న పొలాలను ఉపయోగంలోకి తెచ్చేందుకు కావాల్సిన అంచనాలు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మల్లారం ఆనకట్ట నుంచి గుడి చెరువుకు వచ్చే కట్టు కాలువతో బుడగజంగాల కాలనీ ముంపునకు గురవుతున్న విషయాన్ని ప్రస్తావించారు. కాలువలో పూడికతీయడంతోపాటు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద మూలవాగులో కలిసే విధంగా బుడగ జంగాల కాలనీ వద్ద నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. పట్టణంలో మురికి కాలువలు గుడి చెరువులో కలవకుండా మూల వాగు వరకు కాలువలు నిర్మించేందుకు మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించాలని, అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బాల్కొండ డివిజన్ పరిధిలో ఉన్న రాళ్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ తూమును, రెండు కిలోమీటర్ల కాలువని ఈ జిల్లా పరిధిలో ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కి అప్పగించాలన్నారు. నీటి నిర్వహణ సులభంగా మారి ఎగువన ఉన్న బాల్కొండ నియోజకవర్గంలోని కోనాపూర్ గ్రామ ఆయకట్టుకి నీటిని అందించే బాధ్యతతోపాటు, వేములవాడ నియోజకవర్గంలోని భూషణ్‌రావుపేట్, ఊటపల్లి, చింతకుంట, కథలాపూర్ రైతులకు సాగునీరు అందించడం కోసం ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు లేఖ రాయాలని సూచించారు. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల్లో కోతకు గురైన చెరువుల మరమ్మతుకు సంబంధించి వివిధ స్థాయిలో అంచనాలను త్వరగా ఆమోదించాలని, వచ్చే వర్షాకాలంలోపు చెరువుల మరమ్మతు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ శివకుమార్, ఈఈలు శ్రీనివాసరెడ్డి, అమరేందర్ రెడ్డి, డీఈలు ప్రశాంత్‌కుమార్, శ్రీనివాస్, రవికుమార్, సత్యనారాయణ, వినోద్ కుమార్, క్రాంతికుమార్, సురేశ్, కిషోర్, ఏఈలు నవీన్ కుమార్, శ్రీనివాస్, సాగర్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

వైభవంగా గంగాపరమేశ్వరుల కల్యాణం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి25: నగరంలోని దేవళ్ళపురి ఎల్ఎండిలో గల గంగామాత ఆలయంలో ఆదివారం గంగా పరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ బెస్త (గంగపుత్ర) సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల జాతరను నిర్వహించారు. అనంతరం గంగా పరమేశ్వరుల కల్యాణం నేత్రపర్వంగా జరిపారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు హాజరై బోనమెత్తుకున్నారు. కల్యాణంలో పాల్గొన్నారు. సాయంత్రం తెప్పోత్సవం, గంగా హారతి నిర్వహించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఎంఎల్‌ఏ ముఠా గోపాల్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపర్తి మోహనకృష్ణ, ఆప్కాబ్ మాజీ చైర్మన్ చేతి ధర్మయ్య, మాజీ మేయర్ డి శంకర్, కార్పోరేటర్లు పెద్దపల్లి జితేందర్, దిండిగాల మహేశ్, ఆకుల నర్మదనర్సయ్య, కాసర్ల ఆనంద్, తోట రాములు, చొప్పరి జయశ్రీవేణు, సంఘం జిల్లా అధ్యక్షుడు కూర ధర్మరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు డోలి రాజన్న, ఆలయ కమిటీ అధ్యక్షుడు శేర్వ లక్ష్మీనారాయణ, అన్ని జోన్ల కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌కు సన్మానం



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న జర్నలిస్టులు

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 25: ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) జాతీయ అధ్యక్షుడు, సీనియర్ సంపాదకులు కే.శ్రీనివాస్‌రెడ్డి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమితులుకావడంతో ఆదివారం ఆయనను జర్నలిస్టులు సన్మానించారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్ మాట్లాడుతూ శ్రీనివాస్‌రెడ్డి నియామకం తెలంగాణ జర్నలిస్టులందరికీ లభించిన గౌరవంగా భావిస్తున్నామని కొనియాడారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే నాయకులు ఈద మధూకర్‌రెడ్డి, గాండ్ల శ్రీనివాస్, ఎలగందుల రవీందర్, ఒంటెల కృష్ణ, బి.విజయసింహారావు, కోయడ చంద్రశేఖర్, గాండ్ల సంపత్, ఊరడి రవీందర్, దాడి సంపత్, దూలూరి జగన్మోహన్, చిట్టిమల్ల మహేందర్, తదితరులు శ్రీనివాస్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం కరీంనగర్ ఫొటో అండ్ వీడియో జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్ళ స్థలాలు, హెల్త్‌కార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఫొటో అండ్ వీడియో జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ షుకూర్, ప్రధాన కార్యదర్శి వడ్లూరి నరేష్, ఉపాధ్యక్షులు ఏలేటి శైలేందర్‌రెడ్డి, దాడి సంపత్ కుమార్, సంయుక్త కార్యదర్శి ఎండీ సలీం, కార్యవర్గ సభ్యులు దండు సంపత్, సదానందం, సుధీర్, అంజి, నర్సింగ్, జి అనిల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 25: అయోధ్య క్షేత్రంలోని సరయూ నది ఒడ్డున లక్ష్మణ్ ఖిలా ఘాట్ వద్ద గల రామ మందిర ఆశ్రమంలో ఆదివారం సీతారామ కల్యాణం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలతో రెండోమారు ఘనంగా జరిగింది. అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సమితి అధ్యక్షుడు కల్యాణం అప్పారావు, ఉపాధ్యక్షుడు నటుమాచు చంద్రశేఖర్-రాణి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణంలో దేశంలోని 5 వేల కుటుంబాలు పాల్గొన్నాయి. కరీంనగర్, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ నుంచి 200 మంది ఇందులో పాల్గొన్నారు. అనంతరం హోమం జరిగింది. అంతకు ముందు శనివారం 25 లక్షల వత్తులతో 4వ మారు కోటి దీపోత్సవం జరిపారు. కార్యక్రమంలో మనోహర్, కొండయ్య, రఘుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు కోసం గ్రామస్థుల ధర్నా



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

మానకొండూర్, ఫిబ్రవరి 25: మండలంలోని కొండపల్కలలో డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదివారం గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. పాదయాత్రగా గ్రామంలోని బస్టాండ్ వద్దకు చేరుకుని ధర్నా చేశారు. అనంతరం పాలకులు రోడ్డు నిర్మాణానికి నిధులు చేయాలని అంబేద్కర్ విగ్రహనికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రంగు సంపత్‌గౌడ్ మాట్లాడుతూ చెంజర్ల నుంచి కొండపల్కల వరకు రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. చెంజర్ల నుంచి కొండపల్కల మీదుగా పచ్చునూర్ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్లగొండ వినయ్, గాజుల రాజు, దాసరి శేఖర్, సయ్యద్ బాబుజాని, వేణుగోపాల్, రజనీకాంత్, మల్లేశం, తిరుపతి, వెంకటేశ్, శ్రీనివాస్, హరీష్, వరప్రసాద్, అజయ్ పాల్గొన్నారు.

చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 25: చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు పంజాల జైహింద్‌గౌడ్ అన్నారు. సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పరిటాల రవి సర్వాయి పాపన్న విగ్రహాన్ని అందజేశారు. ఆదివారం మండలంలోని పెద్దపాపయ్యపల్లిలో జైహింద్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహుజన రాజ్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మాటూరి శ్రీనివాస్‌గౌడ్, కొండ మల్లేశంగౌడ్, కలర్ సత్యం, దశరథం, ఐలయ్య, సత్యం, శ్రీనివాస్, అశోక్, రవి పాల్గొన్నారు.

గంగిపల్లిలో అనుమానాస్పద వ్యక్తులు

-పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

మానకొండూర్, ఫిబ్రవరి 25 : మండలంలోని గంగిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆరుగురు వవ్యక్తులను గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. గ్రామంలో కారు రాత్రి తిరుగుతుండగా చిన్న పిల్లలను కిడ్నాప్ చేసే పిల్లలు కావచ్చనే అనుమానంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. కారులో ఇద్దరు పురుషులు, నలుగురు మహిళలు ఉండడంతో వివరాల సేకరించగా పొంతన లేని సమాధానం చెప్పారు. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించి వదిలి పెట్టారు. దీంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు.

ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికుల ఆందోళన

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 25: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లో ఆదివారం రాత్రి ప్రయాణికులు ఆందోళనకు దిగారు. కరీంనగర్ వరంగల్ వెళ్లే ప్రయాణికులు సుమారు మూడు గంటల నుంచి బస్సుల కోసం ఎదురు చూస్తుండగా, బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఆర్టిసి బస్టాండ్ ఆవరణలో ఉన్న ఆర్టీసీ సంస్థకు చెందిన టేబుల్ ను బయట పడేశారు. బస్సు సమాచారాన్ని తెలుసుకునేందుకు ఎంక్వయిరీ కి ఫోన్ చేస్తే.. ఆర్టీసీ అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదు అంటూ ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

‘విద్యార్థులు క్రీడల్లో రాణించాలి’

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 25: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఏసీపీ ప్రతాప్ అన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆయన సూచించారు. ఆదివారం కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో షావోలిన్ కుంగ్‌ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ కరాటే పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు క్రీడలపై ఆసక్తిని పెంచేందుకు కృషి చేస్తున్న తల్లిదండ్రులను ఆయన అభినందించారు. మార్షల్ ఆర్ట్స్ లాంటి యుద్ధ క్రీడను ప్రతి ఒక్కరు నేర్చుకోవలని, ఆత్మస్థైర్యానికి, విశ్వాసానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. జిల్లా కేంద్రంలో ఇటీవల కాలంలో క్రీడా పోటీల నిర్వహణ ఘనంగా నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. క్రీడాకారులు లక్ష్య సిద్ధితో సాధన చేయాలని అన్నారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో మార్షల్ ఆర్ట్స్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ ప్రతాప్

క్రీడాకారులు ఎందరో ఉన్నారని తెలిపారు. మార్షల్ ఆర్ట్స్‌లో రాణించిన వారు అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. అనంతరం పలు విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బంగారు, రజత, కాంస్య పతకాలను ఏసీపీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ప్రదర్శించిన విన్యాసాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల చైర్మెన్ గోవిందవరం కృష్ణ, ఇన్‌స్ట్రక్టర్ ఏ శ్రీనివాస్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, అత్యాపత్యా క్రీడా సంఘం అధ్యక్షుడు చీటి రామారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె సంజీవ రెడ్డి, ప్రొఫెసర్ మల్లారెడ్డి, ఫండస్ స్కూల్ డైరెక్టర్ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్ట్రక్టర్లు సురభి వేనుగోపాల్, బాబు రావు, హరికృష్ణ, విద్యాసాగర్, శేఖర్; మూర్తి, మొయిన్, రవివర్మ, అన్వర్‌ఖాన్; అఖిలక ఫైమిదా ఖాతూన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్తకు అభినందన

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 25: సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజును రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు అభినందించారు. ఆదివారం మండలంలోని సింగాపూర్ గ్రామంలో కెప్టెన్ లక్ష్మీకాంతారావును రాజు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. దేశ మాజీ ప్రధానిపీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వాలంటూ 2018లో పీవీ జన్మించిన వంగర నుంచి ఢిల్లీకి రాజు సైకిల్ యాత్ర చేపట్టారు. 2019లో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీవీకి భారతరత్నం ప్రకటించిన నేపథ్యంలో రాజు కెప్టెన్ లక్ష్మీకాంతారావును కలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ రాజులాంటి ఎందరో ఆంకాంక్షల మేరకు కేంద్ర ప్రభుత్వం పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించిందన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 25: ప్రభుత్వోద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరిచాలని తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ఆదివారం నగరంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి వినతిపత్రం సమర్పించారు.

317 జీవో ద్వారా బదిలీ అయిన ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయులను తిరిగి వారి ప్రాంతాలకు వెంటనే బదిలీ అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగులకు రావలసిన మూడు డీఏలను వెంటనే మంజూరీ చేయించాలని, ఉద్యోగుల సమస్యలను సీఎం, రాష్ట్ర మంత్రి వర్గం దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి సన్మానం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 25: నగరంలో ముస్లిం జేఏసీ ప్రతినిధుల సభకు హాజరైన మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణను ఆదివారం ఘనంగా సన్మానించారు. కరీంనగర్ ముస్లీం జేఏసీ అధ్యక్షులు షేక్ అబూబాకర్ ఖాలీద్ అధ్యక్షతన నూతన ఎమ్మెల్యేలు, మంత్రుల ఆత్మీయ అభినందన సభ ఆదివారం కరీంనగర్‌లోని ఒక హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్ ద్వారా మాట్లాడుతూ అత్యవసర కారణాలతో ఈ కార్యక్రమానికి హాజరుకాలేక పోయానన్నారు. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణకు ముస్లిం జేఏసీ నాయకులు వినతి పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. ఈ సభకు ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన పలువురు ముస్లీం జేఏసీ



కవ్వంపల్లిని సన్మానిస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

నాయకులు జిల్లా ముస్లీం జేఏసీ అధ్యక్షులు షేక్ అబూబాకర్ ఖాలీద్, ప్రధానకార్యదర్శి డాక్టర్ వస్యుద్దీన్ నవాబ్‌లను గజమాలతో ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లీం జేఏసీ నాయకులు ముఫ్తీ ఫియాస్ మోహియు నొద్దీన్, ముఫ్తీ యూనిస్‌ఖాస్మి, మౌలానా అలీముద్దీన్ నిజామి, హఫీజ్ రిజ్వాన్, కరీం నగర్ ఈద్గా మసీద్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ ముజాయిద్ హుస్సేన్, ప్రముఖ కాంట్రాక్టర్ కమాలుద్దీన్, డాక్టర్ అబ్దుల్ ఖుద్దుస్, అబ్దుల్ మతిన్, హఫీజుల్లా పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 25: కరాటే కిక్ బాక్సింగ్ క్రీడలతో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పెంపొందుస్తుందని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఆదివారం నగరంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో వరల్డ్ కరాటే కిక్ బాక్సిక్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ సునీల్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడారంగాల్లో రాణించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. మార్షల్ ఆర్ట్స్, కరాటే, ఉష్, కిక్‌బాక్సిక్ క్రీడలవల్ల శారీరక ధారుఢ్యం, క్రమశిక్షణ, ఆత్మరక్షణతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని అన్నారు. ఆసక్తితో శిక్షణ పూర్తి చేసి గొప్ప క్రీడాకారుడిగా



చాంపియన్లకు బెల్ట్‌లు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మేయర్

మారితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, క్రీడల్లో మెలుకువలను నేర్చుకొని ప్రతిభ చాటాలని క్రీడాకారులకు సూచించారు. పానీపురి అమ్ముకునే జశ్వాల్ క్రికెట్ క్రీడలో డబుల్ సెంచరీ చేసి గొప్ప క్రికెటర్‌గా గుర్తింపు సాధించాడని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. కరాటే కిక్ బాక్సిక్ శిక్షణకు బాలికలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు.

చీఫ్ ఎగ్జామినర్, ఇన్‌స్ట్రక్టర్ వసంతకుమార్ అధ్యక్షతన కరాటే కిక్ బాక్సింగ్ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన చాంపియన్లకు బెల్ట్‌లు, ప్రశంసా పురస్కారాలను మేయర్ సునీల్‌రావు చేతుల మీదుగా అందించారు. ఈకార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే సహకార సంఘాలు బలోపేతం

తిమ్మాపూర్, ఫిబ్రవరి 25: కాంగ్రెస్ పాలనలోనే సహకార సంఘాలు బలోపేతం అయ్యాయని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో గోదాం, రైతు సేవా కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇప్పటికే రెండు ప్రారంభించిందని, మరో రెండు గ్యారంటీలను 27 న ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులకు రెండు లక్షల రూణమాఫీపై ప్రభుత్వం బ్యాంకులతో చర్చలు జరుపుతోందని, త్వరలో ప్రభుత్వం రైతులకు శుభవార్త చెబుతుందన్నారు. రైతులు సహకార బ్యాంకులను సద్వినియోగించుకుని ఎదగాలని, నుస్తులాపూర్ సహకారం సంఘం అన్ని రంగాల్లో ముందుకుసాగలన్నారు. కార్య నుస్తులాపూర్ సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి, సహకార సంఘం సీఈవో అంజనేయులు, కాంగ్రెస్ నాయకుడు మోరపల్లి రమణారెడ్డి పాల్గొన్నారు.



నుస్తులాపూర్‌లో రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

జాతీయ స్థాయి అబాకస్ పోటీలకు ఎంపిక

రామడుగు, ఫిబ్రవరి 25: మండలంలోని వెలిచాలలో సరస్వతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ స్టూడెంట్ రాచమల్ల నవనీత జాతీయ స్థాయి అబాకస్ పోటీలకు ఎంపికయినట్లు స్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నవనీత ప్రథమ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు నవనీతకు ట్రోఫీని, ప్రశంసాపత్రాన్ని అందజేశారన్నారు. ఈ సందర్భంగా స్కూల్ ట్రైనర్ శిరీష, అబాకస్ ట్రైనర్ స్రవంతిని ఆయన అభినందించారు.

వైభవంగా సత్యలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

గన్నేరువరం, ఫిబ్రవరి 25, మండల కేంద్రంలోని సత్యలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు గంజి సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిపై ఊరేగిస్తూ ఒగ్గుడోళ్ల చప్పుళ్లతో, మహిళల కోలాటాలతో ఘనంగా శోభా యాత్రను నిర్వహించారు. అర్చకుడు మణిశంకర్‌శర్మ అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అందరు కలిసి అమ్మవారికి ఆరున్నర కిలోల వెండి తొడుగు, శఠగోపం, పూజా సామగ్రిని విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పాత లింగన్న, కోశాధికారి గంజి శంకర్, గంజి స్వరాజ్‌బాబు, కాశం మధుసూదన్, దేవరశెట్టి నాగేశ్వరరావు, మేడిశెట్టి ఆంజనేయులు, ఆలయ అర్చకులు రాహుల్, రాకేష్ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అసంపూర్తిగా ఎస్సీ కమ్యూనిటీ భవనం

● ఆరేళ్ల క్రితం ఆర్భాటంగా శంకుస్థాపన

చొప్పదండి, ఫిబ్రవరి 25: ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన చొప్పదండి మండల కేంద్రంలో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. ఆరేళ్ల క్రితం ఆర్భాటంగా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి భవన నిర్మాణ పనులకు అవసరమైన నిధులను కేటాయించక పోవడంతో పనులు అర్థాంతరంగా నిలిచి పోయాయి. 2018లో ఆనాటి రాష్ట్ర మంత్రి ఈటల రాజేందర్ కోటి రూపాయల ప్రభు త్వ నిధులతో ఎస్సీ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. త్వరలోనే ఈ భవన నిర్మాణ పనులను పూర్తి చేస్తామని, సమాజంలోని ప్రతి ఒక్కరికి సామాజిక గౌరవం, గుర్తింపు ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని కులాల వారికి కమ్యూనిటీ భవనాలను నిర్మిస్తున్నామని గొప్పగా చెప్పారు. దీంతో ఆనాడు ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారు ఎంతో సంతోషించారు. ప్రారంభించిన కొద్దిరోజులకే పనులను మధ్యలోనే వదిలివేశారు. దీంతో పిల్లర్లకే పరిమితమైన ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని పలుమార్లు ప్రభుత్వాన్ని కోరినా నిధులు మంజూరు చేయలేదు. ఆరు సంవత్సరాలుగా ఎలాంటి పురోగతి లేక పోవడంతో ఎస్సీ సామాజిక వర్గాల వారు నిరాశకు లోనయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఇప్పుడైనా రేవంత్‌రెడ్డి సర్కార్ ఈ భవన నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయిస్తుందని ఆశిస్తున్నారు.



చొప్పదండిలో అర్థాంతరంగా నిలిచిపోయిన కమ్యూనిటీ భవనం

‘జర్నలిస్టులపై దాడులు బాధాకరం’

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 25: ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు ప్రభుత్వానికి తెలియజేసే వారధిగా పనిచేసే జర్నలిస్టులపై దాడులు జరగడం బాధకరమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టులపై దాడులు జరిపితే.. మన గొంతులను మనమే నొక్కుకున్నట్లు అవుతుందని అన్నారు. జర్నలిస్టులపై దాడులు చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 25: జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన ఎండీ ముస్తఫా శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీఎంకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పల్లె ప్రభాకర్‌గౌడ్ ముస్తాఫా కుటుంబ సభ్యులకు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం ఆందజేశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పల్లె రవి, గండి రంజిత్ కుమార్, గిరవేణ రాజయ్య తాటిగంటి వీరస్వామి, మొగిలిపాక లక్ష్మణ్, గండి యాదగిరి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూర్‌లోని ఇండోర్ స్టేడియంలో సౌత్ ఇండియా నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో హుజూరాబాద్ విద్యార్థులు ప్రతిభను కనబరచారని కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ ఓ ప్రకటనలో తెలిపారు. కటాస్ పోటీల్లో షాదుల్లాబాబా, లతీఫ్ బాబా పాల్గొని బంగారు పతకాలు సాధించారన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రిటైర్డు ఎంఈవో గొట్టే జమదగ్ని, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఖాలీద్ హుస్సేన్, నాయకలు ఉప్పు శ్రీనివాస్ పటేల్, ఆలీం, ఇప్పపల్లి చంద్రశేఖర్, రావుల రాజేష్ అభినందించారు.

మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుపై హర్షం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 25: రాష్ట్ర ప్రభుత్వం 317 జీవో సమస్యలపై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేయడం పట్ల జిల్లా టీఎన్‌జీవో అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. 317 జీవో ద్వారా అమలు చేసని ఉద్యోగుల విభజనలో ఏర్పడిన సమస్య లను అధ్యయనం చేసి పరిష్కారాలను సిఫార్సు చేయడం కోసం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు సభ్యులుగా ఏర్పాటు చేయ డాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఉద్యోగుల శాశ్వత కెటాయింపు కోసం గత ప్రభుత్వం 2021 డిసెంబరు 6న 317 జీవోను గత ప్రభుత్వం ఏకపక్షంగా విడుదల చేసిందన్నారు. అందులోని మార్గదర్శకాల కారణంగా పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. క్యాడర్‌లో జూనియర్ అయినందునే స్వంత జిల్లాలను వదలి ఇతర జిల్లాలకు కెటాయించబడ్డారని అన్నారు. పూర్వపు సర్వీసును వదులుకొని అంర్జిల్లా బదిలీ ద్వారా వచ్చిన బార్యభర్తలు కూడా తిరగి వేరుచేయబడ్డారని తెలిపారు. నిబంధనల ప్రకారం దంప తులను ఒకే చోటకు బదిలీ చేయల్సి ఉండగా 19 జిల్లాల్లో అనుమతించి మిగిలా 13 జిల్లాల్లో బ్లాక్ చేశారని పేర్కొన్నారు. స్థానికత కోల్పోయిన ఉద్యోగులకు ఉపాధ్యాయులకు, విడి పోయిన బార్యభర్తలకు న్యాయం చేయానలి కోరుతూ గత రెండు సంవత్సరాలుగా టీఎన్‌జీవో, టీజీవో, యూటీఎఫ్, పీఆర్‌టీయూ మొదలగు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తిని గత ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పీసీసీ ఛీఫ్ రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబుకు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కలిసి సమస్యను కూలంకషంగా వివరించాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 317 జీవో వల్ల ఉత్పన్నమైన సమస్యలను పరిష్కరింస్తామని ఆ మేరకు వారి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారని తెలిపారు. ఇపుడు దీనిపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాడు చేసి వారి చిత్తశుద్ధిని చాటుకున్నారని అన్నారు. మంత్రివర్గ ఉప సంఘం 317 జీవో వల్ల ఉత్పన్నమైన సమస్యలను అధ్యయనం చేసి ఉద్యోగుల సమస్యలను అవ గాహన చేసుకొని సత్వరమే సానుకూల పరిష్కారాలను ప్రభుత్వానిక సిఫార్సు చేస్తుందనే ఆశాబావం వ్యక్త చేశారు.

సామాజిక సేవ అభినందనీయం

వేములవాడ, ఫిబ్రవరి 25: సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని రాజరాజేశ్వర క్షేత్ర ఆర్య వైశ్య వాసవి నిత్యాన్న సత్ర సంఘం ఆధ్వర్యంలో ఆధునికీకరించిన వాసవి కల్యాణ మండపం భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం దూర ప్రాంతాల నుంచి వేములవాడకు వచ్చే యాత్రికుల కోసం ఆర్యవైశ్య సత్రం ఆధ్వర్యంలో ఆధునిక సౌకర్యాలతో వసతి కల్పించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సత్రం నిర్వాహకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

పాలకుర్తి, ఫిబ్రవరి 25: మండలంలోని కుక్కల గుడూరు గ్రామానికి చెందిన కట్కూరి చంద్రమ్మకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆదివారం సింగిల్ విండో చైర్మన్ మనోహర్‌రెడ్డి రూ.5000లతో పాటు 15 సిమెంట్ బస్తాలను వితరణ చేయగా నాయకులు వారి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

సీపీఐ నాయకులకు ఘన నివాళులు

అంతర్గాం, ఫిబ్రవరి 25: రామగుండం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద ఆదివారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కత్తెరమల్ల పోచన్న ఆరుముళ్ళ భూమన్నల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచ న్న, భూమన్నల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు మేరుగ చంద్రయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమం లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఐ కృష్ణ, ఈదునూరి నరేష్, కొల్లూరి మల్లేష్, బొంతు ఆనంద్, శంకర్ పాల్గొన్నారు.

‘బీసీల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం’

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 25 : బీసీల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసి డెం ట్ నల్ల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం కోరుట్ల నియోజక వర్గం ప్రధాన కార్యదర్శిగా పోతు సత్యనారాయణను నియమించిన పత్రాన్ని జాతీయ అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మండభేరి నరేష్‌ల ఆదేశాల మేరకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో అత్యధికంగా బీసీ కులాలు ఎక్కువ ఉన్నా యని, అయినా రాజకీయాల్లో రాణించకపోవడం బీసీల్లో ఐక్యత లేకపోవడమేని అన్నారు. ప్రతి గ్రామాల్లో బీసీలు సమిష్టిగా ఉంటే సమస్యలు సునా యాసంగా పరిష్కరించుకోవడం సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వాలు మా రుతున్న బీసీలను పట్టించుకున్న రాజకీయ పార్టీలు లేవని, ఎన్నికల సమ యంలో బీసీలను ఓటు కోసం వాడుకోవడం తప్ప ఎలాంటి ప్రాధన్యత ఇవ్వ డం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మల శంకర్, తుమ్మనపల్లి రాజు, అంగిరి శేఖర్, నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.